క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

మైలవరం: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి అన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ సౌజన్యంతో జేసీబీ ఏర్పాటు చేసి మైలవరం న్యూ భవానీ నగర్‌లోని శ్రీనివాస అపార్ట్‌మెంట్ వద్ద డ్రెయిన్‌లో పూడిక తీయించి తూములు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ చామల సీతారెడ్డి ఈ పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

రుద్రభూమిలో మంటలు

మైలవరం: స్థానిక నారాయణనగర్ సమీపంలోని వీరశైవ రుద్రభూమి సరిహద్దులోని ముళ్ల కంపకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగి రుద్రభూమికి ఎగబాకాయి. పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో సమీప కాలనీలోని ప్రజలు, రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



గంపలగూడెం: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు దేవయజనం శ్రీధరాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో చూర్ణోత్సవం, వసంతోత్సవం, కొట్నాలు, శ్రీ చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ధ్వజ అవరోహణం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు తదితర కార్యక్రమాలు జరిగాయి. వైస్ చైర్మన్ కూన కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



తిరువూరు: స్థానిక చైతన్య స్కూల్లో శనివారం నిర్వహించిన అబాకస్, మారథాన్ పోటీల్లో 46 మంది ప్రైమరీ తరగతుల విద్యార్థులు విజయం సాధించారని ప్రిన్సిపాల్ ఇబ్రహీం తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి, సృజనాత్మక ధోరణి పెంపొందించడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో అకడమిక్ డీన్ కోటయ్య, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వాసిరెడ్డి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



తిరువూరు: అంతరిక్ష పరిశోధనపై నాసా నిర్వహించిన పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పలువురు ఎంపికయ్యారని తిరువూరు నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభావతి తెలిపారు. శనివారం పాఠశాలలోనిర్వహించిన కార్యక్రమంలో నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. తమ సృజనాత్మకతతో స్పేస్ సెటిల్‌మెంట్ ప్రదర్శనకు, క్లౌడ్ బర్స్ట్ స్ట్రీమ్‌లో పాల్గొనడానికి విద్యార్థులకు అవకాశం లభించింది. పాఠశాల ఏజీఎం హరీష్ బసవరాజు, సౌత్ కోస్టల్ హెడ్ సింహాద్రి, రీజనల్ ఇన్‌చార్జి గురుప్రసాద్, శివరామకృష్ణ, వెంకటదాస్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు

పుట్రేల (విస్సన్నపేట): సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడులు లభిస్తాయని ఏఓ రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం, విత్తన శుద్ధి, మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌కు గౌరవ డాక్టరేట్



మునునూరు: కర్ణాటక రాష్ట్రంలోని ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ తనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించిందని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ శనివారం తెలిపారు. 15 ఏళ్లుగా విద్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన యూనివర్సిటీ తనకు పీహెచ్‌డీ ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీన జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తాను గౌరవ డాక్టరేట్ అందుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్‌ను మండల, నూజివీడు నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



తుమ్మలపాలెంలో పేదలకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని తుమ్మలపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. ఎమ్మెల్యే వసంత ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సామాజిక పరమైన సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఇంటిస్థలం, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. పేదరికంలో మగ్గుతున్న వారికి జగనన్న సంక్షేమ పథకాలు కొండంత అండగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పూసల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో తమ కుటుంబానికి రూ.9 లక్షల మేర లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తంచేశారు. వైఎస్సార్ ఆసరా, పింఛన్ కానుక, ఇంటి స్థలం, వసతి దీవెన, విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ, సున్నావడ్డీ పథకాలు తమకు వర్తించాయన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలుచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచి బొమ్ము వెంకట రమణ, మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పోలగంగు రాణి, పీఏసీఎస్ చైర్మన్ శివారెడ్డి, దుర్గగుడి పాలక మండలి సభ్యుడు చింకా శ్రీనివాసరావు, లంకే అంకమోహనరావు, చింతల చిట్టిబాబు, నల్లమోతు లక్ష్మి, పాలడుగు దుర్గాప్రసాద్, నల్లమోతు చిన్నయ్య, కాంద్రకొండ గురవయ్య, రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

నేలరాలిన రైతుల ఆశలు

- నూజివీడు మండలంలో పెనుగాలులు
- మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం



హనుమంతులగూడెంలోని ఓ తోటలో రాలిన మామిడి కాయలు

నూజివీడు: మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది మామిడి కాపు చాలా తక్కువగా ఉంది. పెనుగాలులకు 25 నుంచి 30 శాతం మామిడి కాయలు రాలిపోయాయి. మండలంలోని అన్నవరం, హనుమంతులగూడెం, మిట్టగూడెం, దిగవల్లి, తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడు తదితర గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి. రైతులు శనివారం తోటల్లో రాలిన మామిడి కాయలను పోగుచేసే పనిలో పడ్డారు. కాపు తక్కువగా ఉండటం, ముదురు మామిడికాయలకు మంచి ధర లభిస్తుందనే రైతుల ఆశలు ఈదురు గాలితో ఆవిరయ్యాయి.

150 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం

పెనుగాలులకు పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలపాలైంది. మండలాల వారీగా నూజివీడులో 100 ఎకరాలు, ముసునూరులో 50 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నట్టు ఏడీఏ విద్యాసాగర్ తెలిపారు. నూజివీడు మండలం అన్నవరం, హనుమంతులగూడెం, మిట్టగూడెం, దిగవల్లి, తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడులలో మొక్కజొన్న నేలవాలింది. రైతులు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది నష్టపోయిన పంట వివరాల జాబితాను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

వైభవంగా కోదండరాముని రథోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన కోదండ రామాలయంలో నవమి వేడుకల సందర్భంగా శుక్రవారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటలకు స్వామి వార్లను ఆలయం నుంచి పల్లకిలో మోసుకుని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై ప్రతిష్ఠించారు. స్వామి వార్లకు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి పూజలు చేసి గ్రామంలోని ప్రముఖులకు బొట్టు పెట్టి తాంబూలాలు అందజేశారు. అనంతరం వందలాది మంది భక్తులు జై శ్రీరాం, జై జై శ్రీరామ అంటూ రథాన్ని మోకులతో లాగుకుంటూ మేళ తాళాలతో డీజే సౌండ్‌తో శనివారం తెల్లవారుజాము మూడు గంటల వరకు గ్రామంలో స్వామివార్లను రథంపై ఊరేగించారు. నూజివీడు సీఐ అంక బాబు తదితరులు పాల్గొన్నారు. మెయిన్ రోడ్డుపై రథోత్సవానికి ఆటంకాలు, ట్రాఫిక్ ఏర్పడకుండా పోలీసులు తగిన జాగ్రతలు తీసుకున్నారు.

ఘనంగా వసంతోత్సవం

చనుబండ కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దంపతులతో పాటు మరో 50 మంది దంపతులు స్వామి వారికి పూజలు చేసి కొట్నాలు (వడ్లు, పసుపు)లను రోకలితో దంచారు. అనంతరం గ్రామంలో వసంతోత్సవం నిర్వహించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మందికి, లోన్ రికవరీ ఏజెంట్లుగా 30 మందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 82477 66718, 91826 26686 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మునుకుళ్లలో పొలంబడి

తిరువూరురూరల్: మండలంలోని మునుకుళ్ల గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిపొలంలో ప్రస్తుతం గింజ గట్టి పడే దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తిరువూరు ఏడీఏ కెనడీ అవగాహన కల్పించారు. క్రమంగా నీటి స్థాయిని తగ్గించి పైరు ఎదుగుదలలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర ఏడీఏ మోనీషా, తిరువూరు ఏఓ పద్మ, మాస్టర్ ట్రైనర్ సురేష్, టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

200 పశువులకు టీకాలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు వేశారు. సీజనల్‌వ్యాధుల బారిన పశువులు పడకుండా టీకాలు విధిగా వేయించాలని పశువైద్యాధికారి స్వప్న రైతులకు సూచించారు. గ్రామంలో 200 పశువులకు టీకాలు వేశారు. సర్పంచి కుటుంబరావు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అజయ్, రాఘవ, వెటర్నరీ అసిస్టెంట్ రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా



గంపలగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

- తిరువూరు శాసనసభ్యుడు రక్షణనిధి
- గంపలగూడెంలో ఆసరా సంబరాలు
- పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు

గంపలగూడెం: వైఎస్సార్ ఆసరా పథకంతో అక్కచెల్లెళ్లకు ఆర్థిక భరోసా లభిస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. గంపలగూడెం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు చెక్కులను ఆయన శనివారం లబ్ధిదారులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ, గత ప్రభుత్వ పాలన తీరును ప్రజలు పరిశీలించి వచ్చే ఎన్నికల్లో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గతపాలకుల హయాంలో జన్మభూమి కమిటీలతో ప్రతి పనికీ రాజకీయ వివక్ష చూపి ప్రజలను నానా ఇబ్బందులు గురిచేసిన వైనాన్ని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలోనూ అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి దేనని అన్నారు. నవరత్నాల్లో భాగంగా ఆసరా పథకాన్ని వరుసగా మూడు విడత విడుదల చేశారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే కుటుంబాలు బాగుంటాయన్న ఆశయంలో ఆసరా పథకాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆసరా నగదును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో అర్హులు అందరికీ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కట్టిలేరు హైబ్రిడ్జి నిర్మాణానికి మరో వారంలో నిధుల కేటాయింపు పూర్తవుతందని తెలిపారు. అనంతరం టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడ్తామన్నారు. మండలంలోని 1,601 స్వయం సహాయక సంఘాలకు చెందిన 19,413 మంది లబ్ధిదారులకు రూ.13,07,48,680 చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో మూడు విడతల్లో ఆసరా కింద మహిళల బ్యాంక్ ఖాతాల్లో రూ.39,22,46,040 జమ చేశామని వివరించారు. ఆసరా నగదు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, గంపలగూడెం, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఆర్.రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, కె.నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, వైస్ ఎంపీపీ పి.రజని, తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు జి.చెన్నకేశవరెడ్డి, సీహెచ్.నర్సారెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, బొల్లా కరుణాకరరావు, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్'ను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి సూచించారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో శనివారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల రాష్ట్ర కన్వీనర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల జెడ్పీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, శామ్యూల్, గన్నా.లోకేశ్వరరెడ్డి, ఎంపీపీలు భారతి, వనజాక్షి, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరావు, నాగేశ్వరరావు, రాణి తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల ట్యాంకర్‌ను అడ్డుకున్న రైతులు



రసాయనాల ట్యాంకర్‌ను అడ్డుకున్న రైతులు

విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి - పుట్రేల గ్రామాల మధ్య ఉన్న ఎన్ఎస్పీ కాలువలో రసాయన వ్యర్థాలను కలపడానికి వచ్చిన లారీ ట్యాంకర్‌ను స్థానిక రైతులు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. కొంత కాలంగా గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో ట్యాంకర్ ద్వారా రసాయన వ్యర్థాలను తీసుకొచ్చి కాలువలో కలుపుతున్నారు. దీంతో సాగునీరు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయి. ఆ నీటిని పశువులు తాగలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు ఎన్ఎస్పీ కాలువ వద్ద రాత్రివేళ కాపలా ఉంటున్నారు. శుక్రవారం రాత్రి రసాయనాలతో వచ్చిన లారీ ట్యాంకర్‌ను పట్టుకొని శనివారం ఉదయం పోలీసులకు అప్పగించారు. వారిపై రైతులు, ఎన్ఎస్పీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ పీ రఘురాం

రెడ్డిగూడెం: మండలంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ పి.రఘురాం శనివారం తెలిపారు. రెడ్డిగూడెం జెడ్పీహెచ్ స్కూలులో 160 మంది, కేజీబీవీ రంగాపురంలో 150 మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో 150 మంది బాలబాలికలు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. బాలురు 241 మంది, బాలికలు 219 మంది పరీక్షలకు హాజరవుతారని వివరించారు. రెడ్డిగూడెం సెంటర్‌కు సి.దామోదర్‌రెడ్డి, కేజీబీవీకి ఎం.క్రిస్టోఫర్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలకు నాగహేమ చీఫ్ సూపరింటెండెంట్‌లుగా, రెడ్డిగూడెం సెంటర్‌కు డి.మురళీమోహనరావు, కేజీబీవీకి ఎ.శ్రీనివాసరావు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలకు ఎం.నాగేశ్వరరావు డిపార్టుమెంటల్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తారని వివరించారు. పరీక్ష పత్రాలను రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామని పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు ముగ్గురు, డిపార్టుమెంటు ఆఫీసర్లు ముగ్గురు, ఇన్విజిలేటర్లు 36 మందిని నియమించామని వివరించారు.

ఎ.కొండూరు మండలంలో..

ఎ.కొండూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ ఎం.రాజశేఖర్ శనివారం తెలిపారు. మండలంలోని కృష్ణారావుపాలెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 168 మంది, కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 216 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించబోమని స్పష్టంచేశారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయండి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునరావు

ఆగిరిపల్లి: నిర్ణీత సమయంలోపు ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు సూచించారు. ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లిలో సంపద తయారీ కేంద్రం పనులను ఆయన శనివారం పరిశీలించారు. మండలంలోని తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో ఎంపికయిన ఆగిరిపల్లి, బొద్దనపల్లి గ్రామాల్లో త్వరలోనే కేంద్ర బృందం పర్యటిస్తుందని, అప్పటిలోగా మరుగుదొడ్ల నిర్మాణం, చెత్త నుంచి సంపద తయారు చేయడం, పారిశుధ్య పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు న్యాయం చేయాలి

నూజివీడు: మిషన్ వాత్సల్య పథకాన్ని సాధ్యమైనంత ఎక్కువ మంది అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులకు దూరమైన పిల్లలకు అందేలా చూడాలని ఎమెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ నూరాని, ఏసీడీపీఓ నాగేశ్వరితో తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రతాప్ శనివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉన్న అనాథ, అభాగ్య పిల్లలందరికీ న్యాయం చేసేలా చూడాలన్నారు. ఈ పథకంలో నెలకు రూ.4 వేలు చొప్పున ప్రతినెలా చెల్లిస్తారని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు కరోనాతో చనిపోయినా, ఆరేళ్ల నుంచి 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరూ చనిపోయినా, మగ పిల్లలకు ఇద్దరూ చనిపోయినా దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, డ్వాక్రా మహిళలు

ఆగిరిపల్లి: మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పామర్తి దుర్గాభవాని ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో 1,234 సంఘాలకు చెందిన 12,734 మంది సభ్యులకు మూడో విడత రూ.12,56,00,627 జమ చేసినట్టు చెప్పారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేస్తున్న సీఎం జగన్‌ను ఆదరించాలని కోరారు. టీడీపీ నాయకుడు లోకేష్ తన పాదయాత్రలో అమ్మ ఒడి, విద్యా దీవెన, ఇతర సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ నాయకులు మట్టిని అమ్ముకుని రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. జన్మభూమి కమిటీల పేరుతో కమీషన్లు దండుకున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ అనూష, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, వైస్ ఎంపీపీలు రమేష్, సాంబయ్య, ఎంపీడీఓ వాణి, ఎంపీటీసీ సభ్యులు షంసున్, గోపీనాథ్, నాయకులు బెజవాడ రాంబాబు, మండల సచివాలయాల కన్వీనర్ భాస్కర్‌ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బ్యాంకు చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర మత్స్యశాఖ వాహనం ప్రారంభం



ఆగిరిపల్లి: మండలంలోని చొప్పరమెట్లకు చెందిన కారుకొండ విజయలక్ష్మి మహిళా కోటా కింద మంజూరైన ఫిష్ ఆంధ్ర మత్స్యశాఖ వాహనాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ప్రారంభించారు. మత్స్యశాఖ ఏడీ రాజేష్, మత్స్యశాఖ తనిఖీ అధికారి సతీష్‌కుమార్, వైస్ ఎంపీపీ గద్దం సాంబయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, బెజవాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

విస్సన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ, డ్వామా పీడీ జె.సునీత శుక్రవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో చెత్త నుంచి సంపద తయారీకి చేపడుతున్న చర్యలపై సిబ్బందికి అనేక సూచనలు చేశారు. అనంతరం విస్సన్నపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో ఏర్పాట్లు గురించి తెలుసుకున్నారు. ఏపీడీ మున్నీ, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఏపీఓ అనురాధ, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

సి.హెచ్. దామోదరరావు, జె.వి. శ్రీనివాస్, యస్.విఠల్, శ్రీమతి పి.రేఖ, వి.యస్.ఎల్.మాధుర్య, న్యాయవాదులు
11-11-8, పట్నూరి వారి వీధి, విజయవాడ. ✆ 9393949545